ఔను.. వాళ్లంతా ఒక్కటయ్యారు

> మంత్రి మల్లారెడ్డి గొప్ప నాయకుడు.. ఆరు లక్షల మంది ఓటర్లు ఉన్న మేడ్చల్‌కు ఆయనే సమర్థుడైన నాయకుడిని.. మేడ్చల్ నుంచి బీఆర్ఎస్ నుంచి రంగంలోకి దించాం.
> – ముఖ్యమంత్రి కేసీఆర్


> మల్లారెడ్డి లక్ష్మీ పుత్రుడు ఆయనకు వద్దంటే డబ్బులే డబ్బులు.. ఆయనను ఎదుర్కొనే సత్తా రాజకీయాల్లో ఎవరికీ లేదు.
> – కల్వకుంట్ల కవిత

> మంత్రి మల్లారెడ్డికి సోషల్ మీడియాలో. ఇతర మీడియాలో ఉన్న ఫాలోయింగ్ నాకు కూడా లేదు. ఆయన ఎదురులేని నాయకుడు.
> – మంత్రి కేటీఆర్

> మంత్రి మల్లారెడ్డి అన్ని విధాలా బలమున్న నాయకుడు.. ఆయన అనుకుంటే ఏదైనా చేయగలుగుతాడు. ఎదుర్కొనే సత్తా ఎవరికీ లేదు.
> – మంత్రి హరీష్‌రావు

- మేడ్చల్‌లో మల్లారెడ్డి వర్సెస్ కాంగ్రెస్ టీమ్
- ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా ఓడించాల్సిందే..
- అన్ని రాజకీయ అస్త్రాలు సిద్ధం చేసుకొని..
- కలిసి పనిచేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేతలు

....ఇలా బీఆర్ఎస్ అగ్ర నాయకులే మంత్రి మల్లారెడ్డి బలమైన నాయకుడని కితాబులిస్తూ ఆయనను బలవంతుడిని చేశారు. నేటి రాజకీయాల్లో అర్థ బలం ఉన్న నాయకుడు, నాలిక ఉన్న నాయకుడే బలమైన నాయకుడు. రెండు గట్టిగా ఉండటంతో మంత్రి మల్లారెడ్డి స్వల్పకాలంలోనే బలమైన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అట్లాంటి బలమైన నాయకుడిని ఎన్నికల్లో ఎదుర్కొనేందుకు మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు ఒక్కటయ్యారు. మంత్రి మల్లారెడ్డి కంటే రాజకీయంలో సీనియర్లు, గతంలో మేడ్చల్ రాజకీయాన్ని వివిధ పార్టీల్లో ఉండి నడిపించిన నాయకులు ఒకేతాటిపైకి వచ్చి రాబోయే ఎన్నికల్లో మల్లారెడ్డిని ఓడిస్తామని శపథం చేస్తున్నారు. - మేడ్చల్



మంత్రి మల్లారెడ్డి కారణంగా సుదీర్ఘ రాజకీయ చరిత్ర, భవిష్యత్ కోల్పోవాల్సిన ప్రమాదంలో పడ్డ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌కు అండగా నిలబడ్డారు. మంత్రి మల్లారెడ్డి వల్ల తనకు రెండుసార్లు టికెట్ రాలేదని, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నక్క ప్రభాకర్‌గౌడ్ పార్టీ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ వెంట కాలికి బొంగరం కట్టుకుని తిరుగుతున్నాడు. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ హరివర్ధన్‌రెడ్డి అలక బూనినా చివరకు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు పలికి పోరాటం కోసం తన ఆయుధాలను సిద్ధం చేసుకుంటున్నారు.

రేవంత్‌రెడ్డి, మైనంపల్లి వ్యూహాలతో..

జిల్లా కాంగ్రెస్‌ను లీడ్ చేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డిని ఓడించాలని పట్టుదలతో ఉండటంతో తన శిష్యుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌ను మొదట కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌కు మద్దతు పలికించాడు. అలకబూనిన హరివర్ధన్‌రెడ్డి ఇంటికి వెళ్లి బుజ్జగించారు. రేవంత్‌రెడ్డి తన బంధువైన మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిలను పార్టీలోకి ఆహ్వానించి వజ్రేష్‌కు బలం చేకూర్చారు.

అగ్రనేతలందరూ కాంగ్రెస్‌లో చేరి..

ఒకనాడు వివిధ పార్టీల్లో ఉంటూ రాజకీయాలు నడిపిన అగ్రనేతలందరూ కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డిని ఓడించేందుకు రంగంలోకి దిగారు. ఓ జట్టుకు కెప్టెన్‌గా మంత్రి మల్లారెడ్డి ఉండగా మరోవైపు తోటకూర వజ్రేష్ యాదవ్ కెప్టెన్‌గా టీంసభ్యులుగా హరివర్ధన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, శరత్‌చంద్రారెడ్డి ఉన్నారు. ఒక్కటైన నాయకులు నియోజకవర్గంలో తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల నుంచి వివిధ పార్టీల్లో ఉన్న తమ నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారు.

మల్లారెడ్డిని తట్టుకునే శక్తి లేక..

మేడ్చల్ రాజకీయంలో ప్రవేశించి సునామీలా వ్యాపించిన మంత్రి మల్లారెడ్డి వల్ల దాదాపు అన్ని పార్టీల అగ్ర నాయకులు బాధితులుగా మారిపోయారు. టీడీపీ నుంచి ఎంపీగా మల్లారెడ్డి, ఎమ్మెల్యే తోటకూర వజ్రేష్‌యాదవ్ పోటీ చేసినా మల్లారెడ్డి గెలిచారే గానీ తోటకూర ఓడిపోయారు. మొదటి నుంచి బీఆర్ఎస్‌లో ఉండి టికెట్ కోసం ఆశపడ్డ హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లు మల్లారెడ్డి రాజకీయం ముందు తేలిపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. తనకు టికెట్ రాకుండా చేసి తన రాజకీయ భవిష్యత్ నాశనం చేశారని సుధీర్‌రెడ్డి సైతం బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇలా నాయకులంతా మల్లారెడ్డి ధన, రాజకీయం ముందు తేలిపోవడం, ఆయనను తట్టుకునే శక్తి లేకపోవడం, బీఆర్ఎస్ అధినాయకత్వం ఆయననే నమ్మడంతో ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరారు.

రాజకీయ భవిష్యత్ కష్టమే..

ఈ ఎన్నికల్లో మల్లారెడ్డిని ఓడిస్తే 2026లో నియోజకవర్గాల పునర్విభజన ఉండటంతో మేడ్చల్ మూడుగా మారుతుందని, అప్పుడు ఒకరికొకరు సహాయం చేసుకుని సులువుగా ఎమ్మెల్యేలుగా గెలుపొంద వచ్చని అంతా.. ఒక జట్టుగా మారారు. ఈ సారి మల్లారెడ్డిని ఓడించకపోతే భవిష్యత్‌లో పునర్విభజన జరిగినా తన ఇద్దరు కుమారులను పోటీగా పెడతారని, ఈ సారి ఎలాగైనా ఓడించేందుకు అసమ్మతి నాయకులంతా ఒక్కటైనట్లు వారి అనుచరులు చెబుతున్నారు. ఈ సారి మల్లారెడ్డి గెలిస్తే తమకు రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తారని వారు అంటున్నారు. మొత్తం మీద ఒక్క నాయకుడిపై మిగతా నాయకుల రాజకీయ భవిష్యత్ ఆధారపడి ఉండటంతో మేడ్చల్ ఎన్నికలు మల్లారెడ్డి వర్సెస్ కాంగ్రెస్ టీంగా మారాయి.


మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

కేసీఆర్ కృషిని దేశమే గుర్తించింది..

మల్కాజిగిరి: రాష్ట్ర భవిష్యత్తు బీఆర్ఎస్‌తోనే సాధ్యమని పార్టీ మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి డివిజన్ లక్ష్మీ సరస్వతినగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దగాకు గురైందని, అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవన్నారు. దశాబ్దకాలంలో బంగారు తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన కృషిని దేశమే గుర్తించిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అధికారంలోకి రావాలన్నారు. ప్రజలు కూడా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సమావేశంలో నందికంటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ తెలంగాణ ద్రోహుల పార్టీ

మలిపెద్ది సుధీర్‌రెడ్డి


కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఆర్ఎస్ నేతలతో..

బోడుప్పల్: బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులను దూరంగా పెట్టి తెలంగాణ ద్రోహుల పార్టీగా మారిందని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ ఉద్యమకారులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి సమక్షంలో బోడుప్పల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతో మంది విద్యార్థులు తమ ప్రాణాలను ఆర్పించగా.. మరెందరో ఉద్యమకారులు తమ జీవితాలను పణంగా పెట్టి రాష్ట్ర సాధన కోసం కృషి చేశారన్నారు. తర్వాత బీఆర్ఎస్ ఉద్యమకారులను పట్టించుకోలేదన్నారు. దీంతో ఎంతో మంది ఉద్యమకారులు రోడ్డున పడ్డారన్నారు. అనంతరం వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ మల్లారెడ్డి నియంతగా వ్యవహరిస్తూ, ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉద్యమకారులు నత్తి మైసయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు నత్తి జంగమ్మ, ఉటుకూరి శారద, పొన్నం నీలిమా, బీఆర్ఎస్ నాయకులు బొబ్బల లక్ష్మారెడ్డి, తూర్పాటి యాదయ్య, దుడ్డెల రామస్వామి, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి సూరి జయతులసితో పాటు పలువురు ఉన్నారు.

మైనంపల్లికి సీనియర్ సిటిజన్ల మద్దతు


మల్లికార్జునగర్‌లో సీనియర్ సిటిజన్లతో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

గౌతంనగర్: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం మల్లికార్జునగర్‌లో సీనియర్ సిటిజన్లు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జునగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్లు ఆయనకు సంఘీభావం తెలిపారు. సీనియర్ సిటిజన్ల సమస్యలను పరిష్కరిస్తానని మైనంపల్లి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లంతా సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మల్కాజిగిరి బీ-బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, సీనియర్ సిటిజన్లు వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, అచ్యుతరావు, పండరి, విజయ్‌కుమార్, రాజలింగం, మనోహర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: హబ్సిగూడ ఫీడర్ హెచ్ఎంటీనగర్, ఎన్‌జీఆర్ఐ సబ్ స్టేషన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామిరెడ్డి తెలిపారు. 11 కేవి రాఘవేంద్రనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా హబ్సిగూడ వీధి నంబర్-8 రవీంద్రనగర్, మహేశ్వరినగర్, జీఎస్ఎన్ కాలనీ, సత్యనారాయణ స్వామి టెంపుల్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

చేయూత



అల్వాల్: అల్వాల్ డివిజన్ బండ బస్తీలోని ఇంటి వద్ద తీవ్ర గాయాలపాలైన చిన్నారి ఆదిత్య వైద్య ఖర్చులకు నిమిత్తం స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి చిన్నారి తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత అందజేశారు. ఆదిత్యకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

22 కేజీల గంజాయి స్వాధీనం



మల్కాజిగిరి: ఎన్నికల తనిఖీలు చేస్తున్న మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నారు. మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. మహేంద్ర సేఠీ వ్యక్తి వద్ద 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, విచారణలో ఒడిశా నుంచి తీసుకు వచ్చినట్లు తెలిపారన్నారు. రైల్వే స్టేషన్‌లో మరో 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ముకుందరెడ్డి, ఇన్‌స్పెక్టర్ భరత్‌భూషణ్, ఎస్ఐలు కుమారస్వామి, ధన్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

హరీషన్న వదిలిన బాణాన్ని..


మంత్రి హరీష్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శిరీషరెడ్డి

- సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి
- హరీష్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లోకి..

కాప్రా: తాను హరీషన్న వదిలిన బాణాన్ని అని, ఇక తన దమ్మేంతో రేవంత్‌రెడ్డికి చూపిస్తానన్నారు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి. టీపీసీసీ మాజీ కార్యదర్శి, ఉప్పల్ కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడిగా ఉన్న సోమశేఖర్‌రెడ్డి ఆ పార్టీని వీడి శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. భారీ ర్యాలీగా తెలంగాణ భవన్‌కు వెళ్లిన ఆయన తన సతీమణి, ఏఎస్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డితో కలిసి మంత్రి హరీష్‌రావు సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు భారీ ఎత్తున అనుచరులు, అభిమానులు కూడా గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరీష్‌రావు ఇచ్చిన మాట, ధైర్యం, నమ్మకంతో తాను బీఆర్ఎస్‌లో చేరినట్లు పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ బాధితుడిగా బీఆర్ఎస్‌లో చేరడం లేదని, రేవంత్ రెడ్డి బాధిత సంఘం(ఆర్‌బీఎస్) అధ్యక్షుడిగా చేరుతున్నట్లు తెలిపారు. తనపై హరీష్‌రావు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాబోయే రోజుల్లో జీవితకాలం హరీష్‌రావు, బీఆర్ఎస్ కోసం పనిచేస్తానన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు యుద్ధభేరికి సిద్ధం కావాలి


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

హబ్సిగూడ: మాదిగల న్యాయమైన వాటాకై వచ్చే నెల 5వ తేదీన ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న యుద్ధభేరి బహిరంగ సభకు మాదిగలు ఐక్యంగా పోరుకు సిద్ధమవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం హబ్సిగూడలోని హోటల్ సుప్రభాత్‌లో ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో మాదిగలు ముందు వరుసలో ఉన్నారని, కేసులు, జైలు జీవితం అనుభవించారన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమైన వాటా కోసం రాష్ట్రంలో 70 లక్షల జనాభా ఉన్న మాదిగ సామాజికవర్గానికి జనాభా దమాషా ప్రకారం అన్ని రంగాల్లో కేటాయింపులు జరగాలని డిమాండ్ చేశారు. కోర్ కమిటీ సభ్యులు కోంగ్ర శంకర్, గుర్రాల శ్రీనివాస్, డాక్టర్ మల్లేశం, పొట్ల పెంజర రమేష్, చింత బాబు, సలేంద్ర బాబురావు, జీడీ.నర్సింహ, మల్లెపోగు శ్రీనివాస్, మోహన్, రుక్కమ్మ, లక్ష్మీ, వెంకట్, ప్రభాకర్, రాజారం తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగను పట్టుకున్న ట్రాఫిక్ పోలీసులు


కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులను అభినందిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

కుషాయిగూడ: దొంగతనాలకు పాల్పడుతూ దర్జాగా తిరుగుతున్న ఓ దొంగను ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్న ఘటన శుక్రవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. గురువారం కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు తాళ్లూరి థియేటర్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఓ వ్యక్తి అనుమానస్పదంగా బైక్‌పై వెళ్తుండగా విచారించారు. పొంతన లేని సమాధానం ఇవ్వడంతో అదుపులోకి తీసుకొని విచారించగా కుషాయిగూడ, సాయినగర్ కాలనీకి చెందిన చోటోలు విజయ్‌గా గుర్తించారు. తాను నడుపుతున్న బైక్‌ను నాగారం టీ జంక్షన్ వద్ద దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అంతేగాకుండా గతంలో 15 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ మల్లయ్య, హోమ్‌గార్డులు సుదర్శన్, కృష్ణలను సీపీ డీఎస్ చౌహాన్ అభినందించి రివార్డులు అందజేశారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



కుషాయిగూడ: ఎన్నికల నేపథ్యంలో కాప్రా సర్కిల్‌లో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ స్టేషన్లను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అభిషేక్ అగస్త్య శుక్రవారం పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని చక్రీపురం, ఏఎస్‌రావునగర్, కమలానగర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సౌకర్యాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు కాప్రా డీసీ ముకుందొరెడ్డి తెలిపారు.

ఉప్పల్‌లో పోలీసుల ముమ్మర తనిఖీలు

ఉప్పల్: మల్కాజిగిరి డీసీపీ జానకి ఆదేశాల మేరకు శుక్రవారం ఉప్పల్ పోలీసులు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఉప్పల్ ప్రశాంత్‌నగర్ దారిలో దాదాపు రెండు గంటల పాటు.. ఉప్పల్ భగాయత్‌లోనూ ముమ్మర తనిఖీలు చేశారు. ప్రశాంతనగర్ వద్ద ఉప్పల్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మల్కాజిగిరి డీసీపీ జానకి ఆకస్మికంగా వచ్చి పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ శ్రవణ్‌కుమార్, ఎస్ఐ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రాలో యాక్టివాను సొంతం చేసుకున్న మల్లేష్‌గౌడ్



మల్లాపూర్: నెహ్రూనగర్ దుర్గామాత అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తీసిన లక్కీ డ్రాలో రాంపల్లివాసి మల్లేష్‌గౌడ్ హోండా యాక్టివా గెలుచుకున్నారు. అదేవిధంగా పలువురికి వెండి కాయిన్లను అందజేశారు. యాక్టివా తాళం చెవులను బీఆర్ఎస్ సీనియర్ నేత కుంటి కృష్ణ, ఎడ్ల వెంకటేశ్వర్లు ఆయనకు అందజేశారు. వెంకటేష్, శ్రీను, భూపతి అశోక్, రాఘవేంద్ర శ్రీను, సాయి, రమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నేతలు

ఉప్పల్: చిలుకానగర్ బీఆర్ఎస్ నుంచి సీనియర్ నేతలు, కార్యకర్తలు శుక్రవారం ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పరమేశ్వర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో జోగు సుదర్శన్, పాలమాకుల పరశురాములు, జోగు నరేష్, ఎల్లయ్య, పల్నాటి లోకయ్య, గండి కృష్ణ, లక్ష్మయ్య తదితరులు చేరారు. రానున్న రోజుల్లో భారీగా చిలుకానగర్ నుంచి బీఆర్ఎస్ నేతలు పార్టీలో చేరతారని అన్నారు. కార్యక్రమంలో చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, ఆకిటి ఆగారెడ్డి, బాలరాజు, బాకారం లక్ష్మణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్, శ్రీనివాస్‌రెడ్డి

కుషాయిగూడ: ఉప్పల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్పొరేటర్ ప్రభుదాస్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి హెచ్‌బీకాలనీలో జరిగిన మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ బూత్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రాధాన్యత నిస్తూ ప్రచారం సాగించాలన్నారు. బూత్ కమిటీలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్, గుమ్మడి జంపాల్‌రెడ్డి, భాగ్యమ్మ, ఫర్వీన్, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించని బీఆర్ఎస్


మాట్లాడుతున్న ఉద్యమకారులు

మల్కాజిగిరి: ఉద్యమకారులను గుర్తించని పార్టీగా బీఆర్ఎస్ చరిత్రలో నిలిచిపోతుందని మల్కాజిగిరికి చెందిన ఉద్యమకారులు తెలిపారు. ఆర్‌కేనగర్‌లో జరిగిన సమావేశంలో రఘుయాదవ్, సంతోష్, నయీమ్ మాట్లాడుతూ రాష్ట్రం ఉద్యమకారుల త్యాగాలతో ఏర్పడిందన్నారు. గద్దెనెక్కిన కేసీఆర్ ఉద్యమకారులకు అన్యాయం చేశారన్నారు. గ్రేటర్‌లో ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత మల్కాజిగిరిలో ఉద్యమం తీవ్రంగా నడిచిందన్నారు. కాంగ్రెస్‌లో టికెట్టు రాని నందికంటి శ్రీధర్‌కు ఎంబీసీ చైర్మన్, పార్టీకి పదేళ్ల దూరంగా ఉన్న వ్యక్తికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పజెప్పారని, మల్కాజిగిరి ఉద్యమకారులు పదవులకు అర్హులు కారా? అని ప్రశ్నించారు. తాము మైనంపల్లికి మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఉద్యమకారులు అమర్, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.


అల్వాల్: మచ్చబొల్లారం మార్కెట్ యార్డులో ప్రచారం చేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి


ఉప్పల్‌లో వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు


మౌలాలి మహాత్మాగాంధీనగర్ వాసులతో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు


ఉప్పల్‌లో కాంగ్రెస్ పథకాలను ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ రజిత


చర్లపల్లి టీచర్స్ కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి